క్లుప్తంగా

ఘనంగా 'రాళ్లపల్లి' జయంతి



అనంతకృష్ణ శర్మ చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కంబదూరు: సాహిత్య విమర్శకుల్లో అగ్రగణ్యులైన రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ 131వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాళ్లపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, అనంతకృష్ణ శర్మ కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసి ఆయన సేవలను కొనియాడారు. అంతకుముందు అనంతకృష్ణ శర్మ చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో అనంతకృష్ణ శర్మ కుటుంబ సభ్యులు శ్యాంసుందరం, నందనందన్, శ్రీనివాసుల శాస్త్రి, వైస్ ఎంపీపీ భీమేష్, ఉప సర్పంచ్ శ్యామంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఊరేగింపు



విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

విడపనకల్లు: అంబేడ్కర్ యువజన సంఘం అధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్ నూతన విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఊరేగించారు. ఉరవకొండ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి 4వ వార్డు మాలగేరి వరకూ తప్పెట్లు తాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు సాగింది. విగ్రహ దాత పవన్ రెస్టారెంట్ రాజు ఆధ్వర్యంలో త్వరలో మాలగేరిలో నూతన విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలగిరిపల్లి ఓబన్న, రిటైర్డు హెచ్‌ఎం తమ్మన్న, సోనియా శీనా, మొలక బాల రామాంజనేయులు, మీనుగ గోపాల్, కోనాపురం ఎర్రిస్వామి, సుభాష్ చంద్రబోస్, సూర్యనారాయణ, తేజు, భవాని, నాగరాజు పాల్గొన్నారు.

కులగణన పక్కాగా నిర్వహించాలి



కులగణన సర్వే చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కుల గణనను పక్కాగా నిర్వహించాలని సర్పంచ్ యోగేశ్వరరెడ్డి సూచించారు. ఆదివారం మండలంలోని శ్రీధరఘట్ట గ్రామంలో కుల గణన సర్వేను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివన్న, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పది' మోడల్ పరీక్షకు స్పందన

రాయదుర్గంటౌన్: పదో తరగతి విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధంగా చేసేలా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టిన పది మోడల్ పరీక్షకు స్పందన లభించింది. పట్టణంలోని మోడల్ స్కూల్‌లో జరిగిన పదో తరగతి మోడల్ పరీక్షకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు చెందిన దాదాపు 480 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయస్వామి, కోశాధికారి హనుమంతు ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, శాంతిరాజు, శశి, మల్లికార్జున, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దశభుజ మహా గణపతికి పూజలు



రాయదుర్గం టౌన్: పట్టణంలోని ఆత్మకూరు వీధిలో వెలసిన దశభుజ మహా గణపతి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. స్థానికులే కాక కర్ణాటక నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా చౌడయ్య జయంతి



అంబిగర చౌడయ్య చిత్రపటాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

కణేకల్లు: పట్టణంలో అంబిగర చౌడయ్య జయంత్యుత్సవాలను బారిక (బెస్త) కులస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చిక్కణ్ణేశ్వరస్వామి ఆలయం వద్ద అంబిగర చౌడయ్య చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేసి ట్రాక్టర్‌లో దిగువ వీధి వరకూ ఊరేగించారు. మహిళలు హారతులు పట్టుకుని ఊరేగింపులో ముందుకు నడిచారు. కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆసరాతో అక్కచెల్లెమ్మలకు భరోసా



పండ్ల వ్యాపారం చేస్తున్న ఈమె పేరు హెచ్.శివమ్మ. డి హీరేహాళ్ మండలం. సోములాపురం గ్రామం. విఘ్నేశ్వర సంఘంలో సభ్యురాలు. బస్టాండ్ సమీపాన ప్రధాన రహదారి పక్కన తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేస్తోంది. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.18,500కు తోడు బ్యాంకు లింకేజీ రుణం అందుకుంది. ఆ డబ్బుతో వ్యాపారాన్ని మరింత మెరుగుపరుచుకుని జీవనం సాగిస్తోంది.



ఈ దుకాణంలో వ్యాపారం చేస్తున్న మహిళ పేరు కె.శిల్ప. బొమ్మనహాళ్ మండలం. గోవిందవాడ గ్రామం. సూర్యోదయ సంఘంలో సభ్యురాలిగా చేరింది. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.26,490 లబ్ధి పొందింది. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1,50 లక్షల రుణం తీసుకుని చిల్లకొట్టును కిరాణా దుకాణంగా మార్చుకుంది. వ్యాపారంలో రాణిస్తూ కుటుంబ పోషణలో కీలక భూమిక పోషిస్తోంది.



చీరల వ్యాపారం చేస్తున్న ఈ మహిళ పేరు కమలమ్మ. డి హీరేహాళ్ మండలం. గొడిశెలపల్లి గ్రామం. శివాంగిని సంఘంలో సభ్యురాలు. వ్యవసాయంలో నష్టాలు భరించలేక ఇష్టమైన చీరల వ్యాపారం దిశగా అడుగులు వేసింది. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.32,568 లబ్ధి పొందింది. అలాగే బ్యాంకు లింకేజీ రుణం, స్త్రీనిధి రుణాలు అందుకుంది. చీరల వ్యాపారం ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందుతోంది.

- డ్వాక్రా సంఘాలను వంచించిన చంద్రబాబు
- ఆదుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- సీఎంకు రుణపడి ఉంటామంటున్న డ్వాక్రా మహిళలు

రాయదుర్గం: మహిళా సాధికారత, స్వావలంబన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఆర్థిక పరిపుష్టి సాధిస్తూ అక్క, చెల్లెమ్మల కళ్లల్లో ఆనందం నింపేలా కృషి చేస్తున్నారు. అన్నింటా అండగా నిలుస్తూ చేయూత అందిస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తూ మహిళా పక్షపాతిగా నిలుస్తున్నారు. డ్వాక్రా మహిళలకు ఓ పక్క సున్నావడ్డీకే రుణాలు అందించడంతో పాటు టీడీపీ హయాంలో పేరుకుపోయిన రుణాలన్నీ మాఫీచేసి సంక్షేమానికి పెద్దపీట వేశారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లోని 1,16,485 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు ఇప్పటికే మూడు విడుతల్లో రూ.229.16 కోట్ల నగదు జమైంది. ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉరవకొండలో బటన్ నొక్కగానే నాలుగో విడుతలో రూ.76.34 కోట్లు జమైంది. ఈ లెక్కన మూడు నియోజకవర్గాల్లో రూ.305.5 కోట్ల నగదు రుణమాఫీ జరిగింది. ప్రతి మండలంలోనూ ఆసరా సంబరాలు పండుగలా చేపట్టేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

రూ.734.53 కోట్ల జమ

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గల్లో 2,38,938 మంది సభ్యులకు రూ.550.94 కోట్లు మూడు విడుతల్లో ఆసరా నగదు జమైంది. ఇటీవల సీఎం జగన్ ఉరవకొండలో బటన్ నొక్కగానే రూ.183.59 కోట్లు మొత్తం నాలుగు విడుతలు కలిపి మొత్తం రూ.734.53 కోట్లు అక్క, చెల్లెమ్మల ఖాతాలకు జమైంది. డ్వాక్రా అక్కచెల్లెమ్మలు ఈ నగదును సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం చెందారు.



– నరసింహారెడ్డి, డీఆర్‌డీఏ, పీడీ అనంతపురం

ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడిగా విష్ణుతేజ



రాయదుర్గం: ఆర్యవైశ్య జిల్లా యువజన సంఘం అధ్యక్షుడిగా రాయదుర్గం పట్టణానికి చెందిన జయంతి విష్ణుతేజను జిల్లా కమిటీ ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్యులు ఆయనకు ఘన సన్మానం నిర్వహించారు. అనంతరం విష్ణుతేజ మాట్లాడారు.. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.

జీవీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పురుషోత్తం



విడపనకల్లు: గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాకే పురుషోత్తంను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈమేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనంతపురంలో శనివారం గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివశంకర్‌నాయక్ అధ్యక్షతన జరిగిన కోర్ కమిటీ సమావేశంలో ఉరవకొండకు చెందిన సాకే పురుషోత్తంను రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యల సాధనకు కృషి చేస్తానన్నారు.

రేపటి నుంచి ఊరి దేవర

కణేకల్లు: మండలంలోని రచ్చుమర్రిలో ఈనెల 30 నుంచి ఊరిదేవర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. గ్రామదేవతలైన దేవమ్మ, దుర్గమ్మ ఆలయాల వద్ద ఊరిదేవర నిర్వహణ కోసం అవసరమైన ఏర్పాట్లను గ్రామస్తులు సిద్ధం చేశారు. మంగళవారం అమ్మవారికి పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. తొమ్మిదేళ్ల తర్వాత ఊరిదేవర నిర్వహిస్తుండటంతో గ్రామంలో పండుగ వాతావరణ నెలకొంది.

వైఎస్సార్ చలువతోనే 'హంద్రీనీవా'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు

విడపనకల్లు(ఉరవకొండ): ఈ రోజు హంద్రీనీవా కెనాల్‌లో నీరు పారుతున్నాయంటే అది వైఎస్సార్ చలువే అని, జీడిపల్లికి నీరు ఇచ్చిన ఘనత కూడా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. ఆదివారం ఉరవకొండలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ బోయ నరసింహులు, పెన్నహోబిలం ఆలయ మాజీ చైర్మన్ అశోక్‌కుమార్, ఉరవకొండ పట్టణ, రూరల్ సమన్వయకర్త మూలగిరిపల్లి ఓబన్న, మాజీ ఎంపీపీ ఏసీ ఎర్రిస్వామి, కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు గోవిందు, జోగి వెంకటేశులు, జేసీఎస్ కన్వీనర్ ఆసిఫ్ మాట్లాడారు. ఉరవకొండలో జరిగిన రా కదలిరా సభలో మాజీ సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే కేశవ్ పచ్చి అపద్ధాలు, మోసాలు చేసే మాటలు మాట్లాడారని విమర్శించారు. నేడు హంద్రీనీవా కెనాల్లో నీరు పారుతున్నాయంటే అది కేవలం వైఎస్సార్ పుణ్యమే అన్నారు. 1996లో ఉరవకొండ, 1999లో ఆత్మకూరు మండలాల్లో చంద్రబాబు హంద్రీనీవాకు శిలాఫలకంతోనే సరిపెట్టాడన్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత హంద్రీనీవా కెనాల్ తవ్వించి నీరు పారించారన్నారు. ఒక్క గంప కూడా మట్టి తీయించని చంద్రబాబు 'హంద్రీనీవా పూర్తి చేసింది నేనే' అని మోసపూరితమైన మాటలు చెప్పంటే రాష్ట్రంలోని ప్రజలు విస్తుపోతున్నారని ఎద్దేవా చేశారు. హంద్రీనీవా ద్వారా ఒక ఎకరాకూ కూడా నీరు ఇవ్వలేని దద్దమ్మ చంద్రబాబు అని మండిపడ్డారు. హంద్రీనీవాకు 40 టీఎంసీలు కేటాయించి కుప్పం వరకూ నీరు పారించిన ఘన చరిత్ర రాజశేఖర్‌రెడ్డిదే అన్నారు హంద్రీనీవాకు 4 టీఎంసీలకు కుదించిన నీచమైన చరిత్ర మీది కాదా అని కేశవ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. హంద్రీనీవా ద్వారా చెరువులకు నీరిచ్చేందుకు తవ్విన రైతుల భూములకు ఒక్క రూపాయి కూడా కేశవ్ పరిహారం ఇప్పించకపోతే జగన్‌మోహన్‌రెడ్డి పాలన వచ్చిన వెంటనే రైతులకు పరిహారం అందించిన వ్యక్తి విశ్వేశ్వరరెడ్డి అన్నారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇస్తే ఓర్చుకోలేని వ్యక్తి, ఉరవకొండను అభివృద్ధి చేశానని గొప్పలు చెప్పుకుంటున్న కేశవ్‌కు ఏమాత్రం సిగ్గూశరం లేదన్నారు. విశ్వేశ్వరరెడ్డిపై అవాకులు, చవాకులు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఉరవకొండ నియోజకవర్గంలో ఎవరు కబ్జాదారులు, దౌర్జన్య పరులో ప్రజలకు బాగా తెలుసన్నారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో భూములు కబ్జా చేసి రిజిస్ట్రేషన్ చేయించుకుంది టీడీపీ నాయకులు కాదా అని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో తహసీల్దారు కార్యలయంలో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్ కురుబ సామాజిక వర్గానికి చెందిన రామలింగ ఆత్మహత్య చేసుకుంది నిజం కాదా? అని నిందించారు. పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న గెస్టు హౌసులో జరిగిన హత్య కేసులో టీడీపీ నేతలు ముద్దాయిలుగా ఉన్నారన్న విషయం అందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చి రవి, ఉలిగప్ప, కె.చిన్న భీమా, పెనకలపాడు భీమన్న, ముస్టూరు బాబు, బోయ లింగన్న, ఎర్రిస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' విజయవంతం చేద్దాం



మేము సిద్ధం అంటూ నినదిస్తున్న ఎంపీ తలారి రంగయ్య, పార్టీ శ్రేణులు



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కళ్యాణదుర్గం: జిల్లాలో ఫిబ్రవరి 3న చేపట్టే వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' కార్యక్రమాన్ని జయవంతం చేద్దామని ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయ కర్త తలారి రంగయ్య సూచించారు. శెట్టూరు మండలం కనుకూరులో ఆదివారం నియోజకవర్గ స్థాయిలో సిద్ధం కార్యక్రమ నిర్వహణపై ఐదు మండలాల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జేసీఎస్ కన్వీనర్లు, సర్పంచులు, పార్టీ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించే సిద్ధం కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవుతున్నారన్నారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ కదలి రావాలన్నారు. సభలో పార్టీ కార్యకర్తలకు సీఎంతో మాట్లాడే అవకాశం వస్తుందన్నారు. అనంతరం వాహనాల ఏర్పాటు, భోజన వసతి తదితర వాటిపై చర్చించారు. మండలాల వారీగా నాయకులు సోమవారం సమావేశాలు నిర్వహించుకుని కార్యకర్తలను సమాయత్తం చేసుకోవాలన్నారు. అనంతరం పేదలకు జరుగుతున్న మంచిని అడ్డుకునేందుకు జెండాలు జతకట్టే టీడీపీ, జనసేన దోపిడీ దారులపై యుద్ధానికి నేను సిద్ధం....మీరు సిద్ధమా అంటూ ఎంపీ నినదించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, రాష్ట్ర జానపద, నృత్య అకాడమీ డైరెక్టర్ బాబురెడ్డి, జెడ్పీటీసీలు మంజునాథ్, గుద్దెళ్ల నాగరాజు, ప్రభావతి, రాధాస్వామి, ఎంపీపీ మారుతమ్మ, జేసీఎస్ కన్వీనర్లు తిమ్మరాజు, అంజి, అర్చన, ఆంజనేయులు, రాము, చంద్రశేఖర రెడ్డి, పార్టీ కన్వీనర్లు శివన్న యాదవ్, బసవరాజు, బాలరాజు, గోపారం శ్రీనివాసులు, దిశ ప్రొటెక్షన్ అధ్యక్షురాలు చందన శివాజీ, కౌన్సిలర్లు, ఐదు మండలాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్ విజన్ ఉన్న నాయకుడు

శెట్టూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గొప్ప విజన్ ఉన్న నాయకుడని ఎంపీ, కళ్యాణదుర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. మండలంలోని శెట్టూరు, చింతర్లపల్లి, అయ్యగార్లపల్లి, పెరుగుపాళ్యం, కనుకూరు, ములకలేడు, అనుంపల్లి, తిప్పనపల్లి గ్రామాల్లో ఆదివారం ఎంపీ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భగా ఆయా గ్రామాలలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంపీకి ఘన స్వాగతం పలికారు. ఆయా సమావేశాల్లో ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌హన్‌రెడ్డి కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలందజేస్తున్నారన్నారు. ప్రతి ఇంట్లో ఫ్యాను ఉన్నట్లే జనం గుండెల్లో సీఎం వైఎస్ జగన్ నిలిచిపోయారన్నారు. పేద వర్గాలకు సంక్షేమ పథకాలు అందించడంతోనే సాధికారత సాధ్యమైందన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో చంద్రబాబు పేదలను నట్టేట ముంచారన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో సమస్యలు పరిష్కరించడానికి చొరవ చూపుతానని హామీ ఇచ్చారు. అయ్యగార్లపల్లిలో శోత్రియం భూముల సమస్యను జెడ్పీటీసీ మంజునాథ్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర పోటీల్లో విజేతగా నిలిచిన కబడ్డీ జట్టును ఎంపీ అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, మండల కన్వీనర్ శివన్న యాదవ్, మాజీ కన్వీనర్ సోమనాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెవుల కిష్టప్ప, మాజీ సర్పంచు బొమ్మక్క రమేష్, నాయకులు హరినాథ్‌రెడ్డి, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి, శ్యామసుందర్ చౌదరి, పోస్టు రామకృష్ణ, వీరాంజినేయులు, అబ్దుల్ రజాక్, వీరభద్రప్ప, కుమార్, జేసీఎస్ కన్వీనర్ తిమ్మరాజు, సుధాకర్, రామాంజనేయులు, మహాబలి, లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



జీడిపల్లిలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

బెళుగుప్ప: మండలంలోని జీడిపల్లిలో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు క్షీరాభిషేకం నిర్వహించారు. జీడిపల్లి పునర్ నిర్మాణ పనులకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద ముంపు గ్రామాన్ని రూ.88 కోట్లతో ఆదుకుంటామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడంపై వారు హర్షం వ్యక్తం చేస్తూ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉరవకొండకు వచ్చిన సందర్భంగా జీడిపల్లి రిజర్వాయర్ నిర్వాసితులకు అండగా ఉంటామని పేర్కొంటూ ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.88 కోట్ల మంజూరుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మచ్చన్న, వాల్మీకి కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రామాంజనేయులు, అంకంపల్లి సర్పంచు రుద్రానంద, ఎంపీటీసీ ప్రభావతి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, గాలి బ్రహ్మయ్య, గంగాధర్, అశోక్, తిమ్మప్ప, హనుమంతప్ప, హనుమంతరాయుడు,ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

మోసకారి చంద్రబాబును నమ్మొద్దు



మాట్లాడుతున్న రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు

వజ్రకరూరు: 'ఉమ్మడి అనంతపురం జిల్లాను అన్నివిధాలా మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో మరో మారు ప్రజలను వంచించడానికి జిల్లా ప్రజలపై కపటప్రేమను చూపు తున్నారు. చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మవద్దు' అని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కాకర్ల నాగేశ్వరరావు, ఉరవకొండ మార్కెట్ మాజీ చైర్మన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు టీడీపీ అధినేత చంద్రబాబు, ఉరవ కొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌పై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో జిల్లా అన్నివిధాలామోసానికి గురయిందన్నారు. జిల్లాకు మంజూరైన ఎయిమ్స్ కళాశాలను ఇతర ప్రాంతానికి తరలించారన్నారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం గురించి మాట్లాడే నైతికహక్కు చంద్రబాబుకు లేదన్నారు. హంద్రీనీవాకు రెండుసార్లు శిలాఫలకం ఆవిష్కరించి ఒక ఇంచు కూడా పనులు చేపట్టలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ అధికారంలోకి వచ్చిన వెంటనే హంద్రీనీవా సుజల స్రవంతి పథకానికి రూ.వేలకోట్లు నిధులు కేటాయించి 95 శాతం మేర పనులు పూర్తి చేశారన్నారు. ప్రస్తుతం జిల్లాకు హంద్రీనీవా నీళ్లు వస్తున్నాయంటే వైఎస్సార్ కృషి ఫలితమేనన్నారు. శనివారం ఉరవకొండలో జరిగిన సభలో టీడీపీ అధినేత చంద్రబాబు పచ్చి అబద్దాలు మాట్లాడారన్నారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఎన్నికలు దగ్గర పడినప్పుడు మాత్రమే ప్రజలు కనిపిస్తారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు రామచంద్ర, తిప్పయ్య, యువజన విభాగం నాయకులు చుక్కా రాజు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచు మృతి



పాటిల్ జగన్మోహన్‌రెడ్డి (ఫైల్)

కణేకల్లు: మండలంలోని గెనిగెర గ్రామ మాజీ సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పాటిల్ జగన్మోహన్‌రెడ్డి (65) మృతి చెందాడు. అనారోగ్యంతో బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శనివారం రాత్రి కన్నుమూశారు. సోమవారం ఉదయం 9 గంటలకు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి భౌతిక కాయానికి జెడ్పీ మాజీ సభ్యుడు పాటిల్ నాగిరెడ్డి తదితరులు పూలమాలలేసి నివాళులర్పించారు.

యువతి అదృశ్యం

వజ్రకరూరు: మండలంలోని పీసీ చిన్నప్యాపిలికి చెందిన యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేష్ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతి శనివారం ఇంట్లోనుంచి బయటకు వెళ్లిందన్నారు. ఆదివారం సాయంత్రమైనా ఇంటికి చేరుకోలేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. యువతి తండ్రి ఈశ్వరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి



సిద్దరాంపురంలో ప్రచారం చేస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

బొమ్మనహాళ్: పారదర్శక పాలన అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి కోరారు. ఆదివారం మండలంలోని సిద్దరాంపురం, చంద్రగిరి, కురువల్లిలో ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరించి వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి వైఎస్సార్‌సీపీని భారీ మోజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఆయన మాట్లాడుతూ 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. మంచి చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఎన్నుకోవాలన్నారు. టీడీపీ నాయకుల దుష్ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, మండల కన్వీనర్ రామాంజినేయులు, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్‌లు ఆంజనేయులు, ఎంపీటీసీ వెంకటేశులు, నాయకులు ఈశ్వర రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పయ్యావుల సత్యన్న, లోకేష్, పరమేశ్వర, విశ్వనాథ్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, జయరామ్‌రెడ్డి, కోటేశ్వరరెడ్డి, రామకృష్ణ, రమేష్, తిరుమలరెడ్డి, జగదీశ్వరరెడ్డి, ముక్కన్న పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి మహేష్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. బోరంపల్లికి చెందిన మహేష్ గోళ్లలోని బంధువుల ఇంటికి ఆదివారం వచ్చాడు. తిరుగు ప్రయాణంలో గోళ్ల దాటిన వెంటనే ద్విచక్రవాహనం వేగం నియంత్రించలేక మహేష్ కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

రాయదుర్గం రూరల్: మండలంలోని చదం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన చాకలి ఎర్రిస్వామి కర్ణాటక మద్యం విక్రయిస్తుండగా అరెస్టు చేశామని అర్బన్ సీఐ ఎం.శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. అతని నుంచి 90 ఎంఎల్ సామర్థ్యం కలిగిన 41 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గ్రామాల్లోకి కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. అక్రమంగా మద్యం సరఫరా చేసినా, విక్రయించినా సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు. సమాచారం ఇచ్చా వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు.